సాక్షి
ఖమ్మం
గురువారం । 30 । మార్చి । 2023



పొగడ చెట్టు నీడలో...
భద్రాచలంలో తొలుత పొగడ చెట్టు నీడలో జరిగే శ్రీసీతారాములు కల్యాణం ఇప్పుడు మిథిలా స్టేడియానికి చేరింది.
10లో



టీకాలే చిన్నారులకు శ్రీరామరక్ష
చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరవని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ రమణ తెలిపారు.
10లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం సా.) 6.27
సహర్ (శుక్రవారం ఉ.) 4.44



భద్రగిరికి కల్యాణశోభ

- నేటి తెల్లవారుజాము నుంచే క్రతువు ప్రారంభం
- మొదట గర్భగుడిలో రామయ్య మూలవిరాట్‌కు లఘుకల్యాణం
- ఆ తర్వాత అభిజిత్ లగ్నంలో మిథిలాస్టేడియంలో..
- విశిష్ట వేడుకగా భద్రాద్రి సీతారాముల పరిణయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : శ్రీరామ నవమి రోజున ఆగమ శాస్త్ర పద్ధతిని అనుసరిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేలాది ఆలయాల్లో కనుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. లక్షల సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. వేలాది మండపాల్లో సీతారాముల కల్యాణం జరిగినా.. అందులో ప్రత్యేకమైనది, విశిష్టమైనది భద్రాచలం మిథిలా స్టేడియంలో గురువారం జరిగే వేడుకలు.

జన్మ నక్షత్రంలోనే కల్యాణం..
ఏ దేవుడు ఏ తిథి, నక్షత్రంలో జన్మించాడో అదే తిథి, నక్షత్రంలో కల్యాణం చేయాలని పాంచరాత్ర ఆగమశాస్త్రం చెబుతోంది. అంటే శ్రీరాముడు పుట్టిన రోజు నాడే పెళ్లి జరుగుతుందన్నమాట. పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని అనుసరించి రామచంద్రస్వామి జన్మించిన చైత్రశుద్ధ నవమి, పునర్వసు నక్షత్రం, అభిజిత్ లగ్నంలో ప్రతీ ఏటా ఆయన కల్యాణం నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ క్రమంలోనే గురువారం చైత్రశుద్ధ నవమి రోజున అభిజిత్ లగ్నంలో భద్రాచలంలోని మిథిలా స్టేడియం వేదికగా శ్రీరాముడు – సీతమ్మవారి కల్యాణం జరగనుంది.

ఏడు తరాల విశిష్టత..
మంగళాష్టకాలు జపిస్తూ శ్రీరాముడు, సీతమ్మకు సంబంధించి ఎనిమిదేసి శ్లోకాలు పఠిస్తారు. ఇందులో వధూవరుల ఏడు తరాలకు సంబంధించి వివరాలు, ఘనతలు తెలియజేస్తారు. అనంతరం నదీస్నానం ఉపయోగాలు వివరిస్తూ మహా సంకల్పం చెబుతారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇవి నిర్వహిస్తారు. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో సీతమ్మ, రామయ్య శిరస్సులపై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని పెడతారు. ఆ తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు తాళిబొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు చేసి సీతమ్మ వారి మెడలో కట్టడంతో కీలక ఘట్టం ముగుస్తుంది.





ఎదుర్కోలు ఉత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం జరిపిస్తున్న అర్చకులు

తెల్లవారుజాము రెండు గంటల నుంచే..
సాధారణ రోజుల్లో తెల్లవారుజామున నాలుగు గంటల తర్వాత సుప్రభాత సేవతో రామయ్యను మేల్కొలుపుతారు. ఆ తర్వాత తిరువారాధన, మంగళాశాసనం, అభిషేకం తదితర పూజలు నిర్వహిస్తారు. కానీ శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గర్భగుడిలో ఉన్న సీతారాములను రాత్రి రెండు గంటల సమయంలోనే మేల్కొలుపుతారు. ఆ తర్వాత నిత్యం నిర్వహించే పూజా కార్యక్రమాలు చేపడతారు.

మొదట గర్భగుడిలో కల్యాణం..
శ్రీరామనవమి రోజున అభిజిత్ లగ్నంలో వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా మిథిలా స్టేడియంలో సీతారాముల కల్యాణం జరుగుతుంది. అంతకంటే ముందే ఉదయం 8 గంటల సమయాన గర్భగుడిలో కొలువై నిత్యం భక్తులను ఆశీర్వదించే రామయ్య మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా లఘు కల్యాణం జరిపిస్తారు. 40 నిమిషాల వ్యవధిలోనే ఈపెళ్లి తంతును ముగిస్తారు. ఆ తర్వాతే మిథిలా స్టేడియంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు వైభవంగా అభిజిత్ లగ్నంలో పెళ్లి జరుగుతుంది.

ఏడడుగుల వేడుక ఇలా..
ఉదయం 9:30 గంటల తర్వాత జనక మహారాజు పుత్రిక సీతమ్మ తల్లి, దశరథ మహారాజు జ్యేష్ఠ పుత్రుడు రామచంద్రస్వామి వార్ల వివాహ వేడుక ప్రారంభమవుతుంది. శంక, చక్ర, ధనుర్బాణాలు ధరించి సీతమ్మతో కూడిన రామయ్య ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీ సేవగా బయటకు తీసుకొస్తారు. కల్యాణ వేదిక వద్దకు వెళ్తున్న సీతారాములకు భజంత్రీలు, సంప్రదాయ నృత్యాలతో భక్తులు స్వాగతం పలుకుతారు. కోలాహలం నడుమ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి మిథిలా స్టేడియంలో అద్భుత శిల్పకళకు నెలవైన కల్యాణ మండపానికి చేరుకుంటారు.

తలంబ్రాలూ ప్రత్యేకమే..
ముత్యాలు కలిపిన, గోటితో వొలిచిన తలంబ్రాలను వధూవరులైన సీతారాములపై పోస్తారు. సాధారణంగా తలంబ్రాలు పసుపురంగులో ఉంటాయి. కానీ భద్రాచల కల్యాణంలో ఉపయోగించేవి గులాబీ రంగులో ఉంటాయి. ఇక్కడ తలంబ్రాల్లో పసుపుతో పాటు గులాల్ ఉపయోగించడం తానీషా కాలం నుంచి వస్తోంది. తలంబ్రాల వేడుక ముగిశాక సీతారాములకు తాత్కాలిక నివేదన చేయించి సీతమ్మ చీర, రామయ్య ధోవతికి బ్రహ్మముడి వేసి, మంగళ హారతి ఇస్తారు. ఆతర్వాత పల్లకీ సేవగా ఆలయంలోకి తీసుకెళ్తారు.

పవిత్ర జలాలతో సంప్రోక్షణ..
కల్యాణ మండపానికి చేరుకున్న సీతారాముడు, లక్ష్మణ స్వామిని వేదికపై వేంచేపు చేస్తారు. కల్యాణ వేడుకకు ఎటువంటి విఘ్నాలు కలగకుండా ముందుగా విశ్వక్సేన పూజ నిర్వహిస్తారు. పుణ్యావాచనం చేసి, మంత్రాలు జపిస్తూ కల్యాణ వేడుకలకు ఉపయోగించే స్థలం, వస్తువులు, ప్రాంగణం, వేడుకలో పాల్గొనే వారిని పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేస్తారు.

కల్యాణ తంతు ఇలా..
శ్రీయోద్వాహము నిర్వహించి అప్పటి వరకు మండపంలోనే ఉన్న సీతమ్మను శ్రీరాముడికి ఎదురుగా కూర్చోబెడతారు. యజ్ఞోపవీత ధారుడైన శ్రీరాముడు సీతమ్మతో కల్యాణానికి సిద్ధమవుతాడు. సీతారాములు ఎదురెదురుగా కూర్చున్న తర్వాత సీతమ్మకు యోక్త్ర బంధనం చేస్తారు. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సీతారాముల వంశ, గోత్రాలతో ప్రవరలు పఠిస్తారు. సాధారణంగా ఎక్కడైనా శ్రీరాముడిది వశిష్ట గోత్రం, సీతమ్మది గౌతమ గోత్రంగా చెబుతారు. కానీ భద్రాచలంలో శ్రీరాముడి గోత్రాన్ని అచ్యుత, సీతమ్మ గోత్రాన్ని సౌభాగ్య గోత్రంగా చెప్పడం విశేషం.

ఆభరణాలతో అలంకరణ..
కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింపజేస్తారు. అనంతరం రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చల హారం రామయ్యకు అలంకరిస్తారు. లక్ష్మణుడికి రామమాడను ధరింపజేస్తారు. తర్వాత సీతారాములకు తేనె, పెరుగు కలిపిన మధుపర్కంతో నివేదన చేస్తారు. పెళ్లి తంతు నిర్వహించే ఆచార్య, బ్రహ్మ శ్రీరాముడికి పాదప్రక్షాళన చేస్తారు. వేదమంత్రాలను పఠిస్తూ కన్యాదానం పురస్కరించుకుని భూదానం, గోదానం చేస్తారు.



సీతమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఐకే.రెడ్డి దంపతులు



ఎదుర్కోలు ఉత్సవం సందర్భంగా మాలపరివర్తనం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

వైభవోపేతంగా ఎదుర్కోలు

- సీతమ్మే గొప్ప.. కాదు రామయ్యే గొప్ప..!
- అర్చకులు రెండు వర్గాలుగా విడిపోయి సంవాదం

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం బుధవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ముందురోజు స్వామి, అమ్మవారి వంశాల విశిష్టత, గొప్పతనాన్ని వివరించే ఈ వేడుక ఆద్యంతం ఆసక్తి గొలిపింది. మా వంశం గొప్పదంటే.. కాదు మా వంశమే గొప్పదంటూ అర్చకులు కొందరు సీతమ్మ వారివైపు, మరికొందరు రామయ్య వైపు చేరి ఈ వేడుకను నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియజెప్పేందుకే ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామివారిని భక్తులంతా దర్శించుకునేందుకు వీలుగా కల్యాణ మండపం వద్ద ఈ వేడుక నిర్వహించారు. మిథిలా స్టేడియాన్ని సీతమ్మ వారికి మిథిలా నగరంగా, వైకుంఠ ద్వారం రామయ్యకు చెందిన అయోధ్యగా అభివర్ణించారు. వేలాది మంది భక్త జన సందోహం నడుమ ఈ వేడుకలు జరిగాయి. హిందూ, ముస్లిం మత సామరస్యాన్ని పెంపొందించేలా భక్తులందరికీ పన్నీరు చల్లడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేకత. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాద్రి ఆలయంలో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత ఊరేగింపుగా స్వామివారిని ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ ఈఓ రమాదేవి, స్థానాచార్యులుస్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, పి.సీతారామానుజాచార్యులు పాల్గొన్నారు. కాగా, ఏపీ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారికి పుష్పయాగం



పుష్పయాగం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం తర్వాత, స్వామి, అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించారు. అలాగే, యాగశాలలో హోమం జరిపించాక.. పుష్పయాగాన్ని కనులపండువగా నిర్వహించారు. అంతేకాక స్వామి, అమ్మ వార్ల నిత్యకల్యాణం, పల్లకీ సేవ, గరుఢ వాహనంపై ఆలయ గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఈఎస్ఐ ఆస్పత్రితో పాటు బ్రాంచ్ ఆఫీస్ ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల జరిగిన ఈఎస్ఐ 13వ రీజినల్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతోనే జిల్లాకు ఈఎస్ఐ ఆస్పత్రి మంజూరైందని పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారులు, బ్రిడ్జిలు నిర్మించండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: సత్తుపల్లి–మర్లపాడు రోడ్డును డబుల్ బీటీ రోడ్డుగా చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆయన వినతిపత్రం అందించారు. అలాగే, పెనుబల్లి మండలం కొండ్రుపాడు–లంకాసాగర్‌కు బీటీ రోడ్డు, తల్లాడ మండలం నూతన్‌కల్–గూడూరు మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు 14,508మంది విద్యార్థులకు గాను 14,014మంది హాజరు కాగా 494మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా సాగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు.

రెండు లారీలు ఢీ, డ్రైవర్‌కు గాయాలు



రహదారిపై ఢీకొన్న రెండు లారీలు

ముదిగొండ: మండలంలోని వెంకటాపురం – గోకినేపల్లి రహదారిపై బుధవారం సాయంత్రం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనటగా ఒక డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఖమ్మం – కోదాడ ప్రధాన రహదారిపై జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. దీంతో సర్వీస్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించగా.. అవి కానరాకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు లారీలు ముందు భాగం ధ్వంసం కాగా, ఒక డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

గడ్డి మందు తాగి పూజారి ఆత్మహత్యాయత్నం

బోనకల్: మండలంలోని చిరునోములకు చెందిన పూజారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని దుర్గామాత ఆలయం పూజారి శ్రీనివాసచారి ఆరు నెలల క్రితం తన స్వగ్రామమైన హుజూర్‌నగర్‌కు భార్యతో కలిసి వెళ్లాడు. తిరిగి మంగళవారం గ్రామానికి వచ్చిన ఆయనను ఆటోలో పంపించాలని గ్రామస్తులు భావించారు. ఈ క్రమంలో బుధవారం గుడి ముందు అపస్మారక స్థితిలో పడి ఉండగా, పక్కనే గడ్డి మందు డబ్బా ఉండటంతో 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియరాలేదు.

పొగడ చెట్టు నీడలో..

తొలినాళ్లలో రామయ్య కల్యాణం అక్కడే..

- ఆ తర్వాత చిత్రకూట మండపంలో..
- ప్రస్తుతం మిథిలా స్టేడియంలో వేడుకలు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : శ్రీరామదాసు కాలంలో భద్రాచలం ఆలయ ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడన సీతారాముల కల్యాణం నిర్వహించేవారని అర్చకులు చెబుతున్నారు. ఆ తర్వాత కాలంలో భక్తుల సంఖ్య పెరగడంతో పెళ్లి వేదికను చిత్రకూట మండపంలోకి మార్చారు. గోదావరిపై వంతెన నిర్మాణం పూర్తయ్యాక భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోకి చేరుకుంది. చిత్రకూట మండపంలో అంతమంది పెళ్లి చూడటం కష్టం కావడంతో కల్యాణ వేడుకను బయట జరిపించాలని నిర్ణయించారు. దీంతో 1964లో ఉత్తర ద్వారానికి ఎదురుగా ప్రత్యేకంగా కల్యాణ మండపం నిర్మించారు. 1998లో ఎన్టీఆర్ హయాంలో కల్యాణ మండపం చుట్టూ భక్తులు కూర్చుని చూసేందుకు వీలుగా గ్యాలరీ నిర్మించారు. అప్పటి నుంచి కల్యాణ వేడుక జరిగే ప్రదేశాన్ని మిథిలా స్టేడియంగా పిలుస్తున్నారు. ఆ తర్వాత స్టేడియంలో గ్యాలరీపై ఎండా, వానల నుంచి రక్షణ కోసం షెడ్డు నిర్మించారు.



శ్రీ సీతారాముల కల్యాణానికి ముస్తాబైన మండపం

పెళ్లి పెద్దలు వీరే..

శ్రీరామదాసు కాలం నుంచి భద్రాచలంలో నిత్య పూజలు, శ్రీరామనవమి, పట్టాభిషేకం తదితర వేడుకలు నిర్వహించేందుకు కోటి, అమరవాది, పాడిచేటి, గొట్టుపుళ్ల, తూరుబోటి కుటుంబాలకు చెందిన అర్చకులను నియమించారు. వంశపారంపర్యంగా వీళ్లే ఈ బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ఇందులో నవమి వేడుకల బాధ్యతలను వంతుల వారీగా ఈ కుటుంబాలు నిర్వహిస్తుంటారు. శ్రీరామ నవమికి మిథిలా స్టేడియంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాల్లో కీలక పాత్ర పోషించేది ఆచార్య. ఇతని చేతుల మీదుగానే కల్యాణం మొత్తం జరుగుతుంది. ఆయనకు సూచనలు అందించే వ్యక్తిని బ్రహ్మగా పేర్కొంటారు. వీరిద్దరికీ సహాయకులుగా ఇద్దరు చొప్పున నలుగురు రుత్విక్‌లు ఉంటారు. వీరికి పూజా సామగ్రి అందించేందుకు ఇద్దరు చొప్పున నలుగురు పరిచారకులు ఉంటారు. ప్రస్తుతం ఆలయంలో ప్రధాన అర్చకులైన ఇద్దరు వీరందరికీ అధ్వర్యులుగా వ్యవహరిస్తారు. మొత్తంగా 12 మంది సీతారాముల పెళ్లి వేడుకలో కీలకంగా వ్యవహరిస్తారు. వీరందరినీ ఉత్సవాల్లో భాగస్వామ్యం చేస్తూ, కల్యాణతంతు శాస్త్రోక్తంగా, సంప్రదాయ బద్ధంగా పూర్తి చేసేలా స్థానాచార్యులు స్థలశాయి 'పెద్ద పాత్ర'ను నిర్వర్తిస్తారు.

టీకాలే చిన్నారులకు శ్రీరామరక్ష

ఏన్కూరు/కల్లూరు: టీకాలే చిన్నారులకు శ్రీరామరక్షగా నిలుస్తాయని జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ సీహెచ్.వీ.రమణ తెలిపారు. ఏన్కూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ సెంటర్లను బుధవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులతో పాటు గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు. ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే కాక వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. వైద్యాధికారులు రాములు, నవ్యకాంత్, సీహెచ్ఓలు శివరాజు, రేవతి, ఉద్యోగులు అర్జున్, రమణ తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సిన్ నిల్వలను పరిశీలిస్తున్న మేనేజర్

గ్రీవెన్స్ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు, రేమిడిచర్ల, ఎర్రుపాలెం, జమలాపురం గ్రామాల్లో బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ఆర్డీఓ రవీంద్రనాథ్ పర్యటించారు. కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్ డేలో పలువురు ఇచ్చిన ఫిర్యాదులను విచారించాలన్న కలెక్టర్ ఆదేశాలతో వారు వచ్చారు. మామునూరులో పత్తిపాటి అన్నపూర్ణమ్మ తమ స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేయగా కొలతలు వేసి ఆక్రమణ కాలేదని తేల్చిచెప్పారు. అలాగే, మండల కేంద్రంలోని 318 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని పుప్పాళ్ల బొల్లయ్య ఫిర్యాదు చేయగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ తిరుమలాచారిని ఆదేశించారు. ఆతర్వాత రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన 60 ఎకరాల భూమిని పరిశీలించారు. ఆర్ఐ అశోక్ కుమార్, సర్వేయర్ అశోక్ పాల్గొన్నారు.



మామునూరులో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

జాతీయ స్థాయి పోటీలను విజయవంతం చేయండి

కూసుమంచి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని జీళ్లచెరువులో నిర్వహించే జాతీయ స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు, మహిళల ప్రో కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోటీల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పోటీలు చూసేందుకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే, ఐదేళ్లుగా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఇంటూరి శేఖర్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, బోడ మంగీలాల్, జడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్‌తో పాటు రామసహాయం బాలకృష్ణారెడ్డి, కోటి సైదారెడ్డి, కొండా సత్యం, వేముల వీరయ్య, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీరామనవమి సందర్భంగా ఖమ్మంలోని పర్ణశాల రామాలయంలో గురువారం జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా సాయంత్రం లకారం ట్యాంక్‌బండ్‌లో తెప్పోత్సవం జరగనుంది. ఈమేరకు ఏర్పాట్లను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం రాత్రి పరిశీలించారు. తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తెప్పోత్సవం జరిగే బోట్‌లో ట్రయల్ రన్ చేపట్టారు.



బోట్‌లో వెళ్తూ సూచనలు చేస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

పంట నష్టం సర్వే త్వరగా పూర్తిచేయాలి

చింతకాని: అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటల సర్వే త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల ఆదేశించారు. మండలంలోని నాగులవంచ, మత్కేపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనుందని తెలిపారు. మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏఓ పల్లెల నాగయ్య, ఏఈఓలు హరికృష్ణ, తాహియా నౌషీన్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వీసీలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఖమ్మం సహకారనగర్: వచ్చేనెల 3వ తేదీ నుంచి మొదలుకానున్న పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆమె విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య సంచాలకులు దేవసేనతో కలిసి జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక ప్రతీ కేంద్రంలో ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలని, ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ సర్వీసులు నడిపించాలని సూచించారు. జిల్లా నుంచి డీఆర్వో శిరీష మాట్లాడుతూ జిల్లాలో 103 కేంద్రాలు ఏర్పాటు చేయగా 16,873 మంది రెగ్యులర్, 443 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ వీసీలో డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ మాలతి, ఏసీపీ ప్రసన్నకుమార్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న డీఆర్వో శిరీష, పక్కన డీఈఓ శర్మ

రేపు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. ఈమేరకు అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. అధ్యక్ష స్థానానికి ఆరుగురు పోటీ పడుతుండడం గమనార్హం. అభ్యర్థులు కరపత్రాలు, వాట్సప్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అధ్యక్ష స్థానానికి చిలుకూరి స్వర్ణకుమారి, దిరిశాల కృష్ణారావు, మల్లెంపాటి అప్పారావు, ఎం.ఏ.తౌఫిక్, నేరెళ్ల శ్రీనివాసరావు, రాజపుట్ సుధీర్ సింగ్, కార్యదర్శి స్థానానికి చింతనిప్పు వెంకట్, మన్నేపల్లి బసవయ్య, సంయుక్త కార్యదర్శిగా అయ్యాదేవర విజయరాఘవ, కండె వెంకటేశ్వరరావు, క్రీడా కార్యదర్శికి పెరుమళ్లపల్లి జానయ్య, రావుల వెంకట్ రంగంలో ఉన్నారు. శుక్రవారం ఉదయం 10నుండి సాయంత్రం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి సోమశేఖర్‌శర్మ తెలిపారు.

పోలీస్‌నంటూ వాహనంతో పరారీ

ఖమ్మంక్రైం: పోలీసునని చెప్పుకుంటూ యూనిఫాంతో వచ్చిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ సమీపాన మెడికల్ షాపు వద్ద బుధవారం మధ్యాహ్నం నిల్చున్న విజయ్‌భాస్కర్ వద్దకు పోలీస్ యూనిఫాంలో ఉన్న ఓ వ్యక్తి వచ్చాడు. ఖమ్మం టూ టౌన్ ఎస్సై త్వరగా రమ్మన్నారని చెబుతూ ద్విచక్రవాహనం అడగడంతో విజయ్ ఇచ్చాడు. అయితే, ఎంతకూ రాకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అలాంటి పోలీకుతో ఎవరూ లేరని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు. అనంతరం సీఐ శ్రీధర్ సిబ్బందితో వచ్చి ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు.

ఎంత పని చేస్తే అంతే డబ్బు..

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో గతంలో మాదిరి మస్టర్ల విధానంలో కాకుండా ఎంత పని చేస్తే ఆ కొలతల ప్రకారమే చెల్లింపులు ఉంటాయని డీఆర్‌డీఓ విద్యాచందన వెల్లడించారు. మండలంలోని వి.వెంకటాయపాలెం, వేపకుంట్లలో ఉపాధి హామీ పనులు, హరితహారం నర్సరీలు, నాటిన మొక్కలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గతంలో ఇచ్చిన అలవెన్స్‌లన్నీ రద్దు చేసి, రోజుకు కనీసం 4, 5 గంటలు పనిచేస్తే కొలతల ప్రకారం కూలి అందుతుందని తెలిపారు. కాగా, మహిళల ఆరోగ్య రక్షణ కోసం మంచుకొండ పీహెచ్‌సీలో ప్రతీ మంగళవారం చేస్తున్న ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతన కలెక్టరేట్‌లో పల్లె పకృతి వనాన్ని కూడా డీఆర్‌డీఓ పరిశీలించారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ పద్మయ్యనాయుడుతోపాటు యరగర్ల హన్మంతరావు, శ్రీధర్‌రెడ్డి, శ్రీలత, దీపక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలకు సూచనలు చేస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

బియ్యం.. ఆరు కేజీలు!

ఖమ్మం సహకారనగర్: పౌరసరఫరాల శాఖ ద్వారా పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యం కోటా పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఒక్కో లబ్ధిదారుడికి ఐదు కేజీల చొప్పున బియ్యం ఇవ్వగా, ఏప్రిల్‌లో మాత్రం ఆరు కేజీల చొప్పున ఉచితంగా ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 748రేషన్ షాపుల ఉండగా... వీటి పరిధిలో 4,12,743 కార్డులు, 11,41,601మంది లబ్ధిదారులు ఉన్నారు.

జిల్లాకు చేరిన రంజాన్ 'తోఫా'

ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం ముస్లిం కుటుంబాలకు అందజేసే రంజాన్ గిఫ్ట్స్(తోఫా) జిల్లాకు చేరుకున్నాయి. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వీటిని త్వరలోనే ముస్లింలకు అందజేయనున్నారు. ఒక్కో గిఫ్ట్ ప్యాకెట్‌లో చీర, జాకెట్, పంజాబీ డ్రెస్ మెటీరియల్, లాల్చీ, పైజమా క్లాత్ ఉంటుంది. జిల్లాకు 8,500 గిఫ్ట్ ప్యాకెట్లను ప్రభుత్వం మంజూరు చేయగా.. ఖమ్మం నియోజకవర్గానికి 2,500, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు 1,500 చొప్పున కేటాయించారు. ఇక జిల్లాలోని 17 ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యాన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చేందుకు రూ.17లక్షలను మంజూరయ్యాయి. ఖమ్మం నియోజకవర్గంలోని ఐదు ప్రాంతాలతో పాటు పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని మూడేసి ప్రాంతాల్లో ఇఫ్తార్ విందులకు నియోజకవర్గానికి రూ.3లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాహాబాహీ

ఇరువర్గాలకు చెందిన 11 మందిపై కేసు

బోనకల్: బోనకల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రాత్రి 11 గంటల సమయాన రెండు వర్గాల వారు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పరస్పరం దాడులు చేసుకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావినూతలకు చెందిన షేక్ జానీ, అదే గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఇటీవల అక్రమ కలప రవాణా చేస్తున్నట్లు తనపై సామాజిక మాధ్యమాల ద్వారా జానీ ప్రచారం చేస్తున్నాడని ఎస్ఐ కవితకు ఫిర్యాదు చేసేందుకు సత్యనారాయణ స్టేషన్‌కు వచ్చారు. అక్కడ జానీ కనిపించడంతో ఈ విషయమై ప్రశ్నించగా వివాదం మొదలైంది. దీంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. ఈమేరకు ఎస్సై ఇచ్చిన సమాచారంతో వైరా ఏసీపీ అబ్దుల్ రెహమాన్, మధిర సీఐ ఓ.మురళి చేరుకున్నారు. కాగా, పోలీసుస్టేషన్‌లో గొడవపడి, టేబుల్‌ను ధ్వంసం చేయడమే కాక విధులకు ఆటంకం కలిగించినట్లు హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్ ఫిర్యాదు చేయగా హన్మంతరావు, షేక్ జానీ, గల్లా సత్యనారాయణ, షేక్ బాబు, తాళ్లూరి సురేష్, ఎర్రగాని నాగరాజు, గుగులోతు నరేష్, షేక్ సద్దాం హుస్సేన్, ఇండ్ల రవి, షేక్ రహీం, కోయినేని ప్రదీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కవిత తెలిపారు.

మూగ జీవాల మృత్యువాత

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్వాధీనం
- అప్పటికే నాలుగు పశువులు మృతి

ఖమ్మంఅర్బన్: డీసీఎంలో రెండు అరలు ఏర్పాటుచేసి 70 పశువులను కుక్కారు. ఆపై ఒడిశా నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా ఖమ్మం పోలీసులు బోనకల్ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. వాహనాన్ని ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాలకు తీసుకెళ్లారు. బుధవారం ఉదయం పరిశీలించే సరికి నాలుగు పశువులు మృతి చెందగా, మరో పది పశువులకు తీవ్ర గాయాలై మృత్యువుతో పోరాడుతున్నాయి. దీంతో గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసచార్యులు, యల్లంపల్లి హన్మంతరావులు ప్రభుత్వ పశువైద్యుడు రాధాకృష్ణమూర్తిని పిలిపించి చికిత్స చేయించారు. ఈమేరకు సూర్యాపేటకు చెందిన డీసీఎం డ్రైవర్ అంగడి రాజును అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, ఒడిశాలో పశువులను ఎక్కించి హైదరాబాద్ తీసుకెళ్లమన్నారే తప్ప ఎలాంటి పత్రాలు ఇవ్వలేదని, ఇతర వివరాలు చెప్పలేదని పేర్కొన్నారు. కాగా, గోశాల నిర్వాహకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ తమ వద్ద పశువులు ఇప్పటికే ఎక్కువగా ఉన్నాయని, పోషించే స్థోమత లేదని చెప్పినా బలవంతంగా దించారని పేర్కొన్నారు.



గాయపడిన పశువులకు వైద్యం చేయిస్తున్న దృశ్యం

క్లుప్తంగా...

భార్య, కూతురిని చంపిన భర్త


రమణాచారి(ఫైల్)


చందన(ఫైల్)


రమ(ఫైల్)

భూపాలపల్లి: వరకట్నం, కుటుంబ కలహాల నేపథ్యంలో సైకోగా మారిన ఓ వ్యక్తి భార్య, కూతురును గొడ్డలితో నరికి చంపాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. భూపాలపల్లిలోని వేశాలపల్లికి చెందిన ఎలకంటి రమణాచారి 3 నెలలుగా కుటుంబసభ్యులను చంపుతానంటూ బెదిరిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న భార్య రమ(35), కూతురు చందన (18)ని గొడ్డలితో నరికి చంపాడు. తండ్రి చేస్తున్న ఘాతుకాన్ని చూసిన కుమారుడు విశ్వ స్థానికులకు చెప్పగా, వారు అతడిని పట్టుకుని చితకబాదారు.

వ్యభిచారానికి అడ్డుగా ఉన్నాడని కొడుకును చంపేసింది

- గతంలోనూ చిన్న కుమారుడి హత్య!


కొడుకు మృతదేహం వద్ద తల్లి

మాక్లూర్: తన వ్యవహారాలకు అడ్డుగా ఉన్నాడని ఆరేళ్ల కొడుకును హతమార్చిందో తల్లి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దాస్‌నగర్ శివారు అటవీ ప్రాంతంలో గల నిజాంసాగర్ ప్రధాన కాల్వ వద్ద బుధవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లికి చెందిన లావణ్యకు 16 ఏళ్ల క్రితం నిజామాబాద్‌లోని ఇందిరాపురం కాలనీకి చెందిన భరత్‌తో వివాహమైంది. వీరికి రోహిత్ (6), గన్నయ్య ఇద్దరు కుమారులు. భరత్ రోజువారీ కూలి పనులు చేస్తాడు. లావణ్య కూడా కొన్నిసార్లు కూలీగా పని చేసింది. ఈ క్రమంలో రెండేళ్లుగా ఆమె వ్యభిచారానికి అలవాటు పడింది. దీంతో తనకు అడ్డుగా ఉన్నాడని పెద్ద కుమారుడు రోహిత్‌ను గొంతునులిమి హతమార్చింది. మృతదేహాన్ని కాల్వలో పడేసి మద్యం మత్తులో అక్కడే కాల్వ గట్టుపై నిద్రించింది. గతంలోనూ చిన్న కుమారుడు గన్నయ్యను కామారెడ్డి ప్రాంతంలో ఇలాగే చంపి కుటుంబ సభ్యులకు కట్టుకథలు చెప్పి తప్పించుకుందని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవనాడికి సహకరించండి

పోలవరానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయండి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు
- హామీలిచ్చి తొమ్మిదేళ్లు పూర్తయింది
- రాష్ట్ర సమస్యలపై దృష్టి సారించండి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విభజన హామీల నోడల్ ఏజెన్సీ అయిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని వివరించారు. బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన రాత్రి సుమారు 40 నిమిషాల పాటు అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 'అశాస్త్రీయ విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా, ఆదాయాల పరంగా, అభివృద్ధి పరంగా, వివిధ సంస్థల రూపేణా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నష్టాల నుంచి కాపాడేందుకు పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చింది. అది జరిగి తొమ్మిదేళ్లు కావొస్తున్నా రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిపై వెంటనే దృష్టి సారించాలి'అని సీఎం కోరారు. ఇంకా అమిత్ షా దృష్టికి తీసుకెళ్లిన అంశాలు ఇలా ఉన్నాయి.

వేగం పెరగాలంటే నిధులివ్వాలి

☛ అనూహ్య వరదల కారణంగా పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఆ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని డీడీఆర్‌ఎంపీ అంచనా వేసింది. ఈ సొమ్ములు వెంటనే విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సొంత ఖజానా నుంచి రూ.2,600.74 కోట్లు ఖర్చు చేసింది. రెండేళ్లుగా ఈ సొమ్ము పెండింగ్‌లో ఉంది. వెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ.55,548 కోట్లుగా నిర్ధారించింది. ఈ మొత్తానికి వెంటనే ఆమోదం తెలపాలి. పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి.

☛ 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.36,625 కోట్లు వెంటనే విడుదలయ్యేలా చూడాలి.


బుధవారం ఢిల్లీలో అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం జగన్

☛ తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాలి.

☛ రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీని వల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. అందువల్ల రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతున్నాం.

ట్రోల్ చేస్తే తోలు తీస్తారు

అభ్యంతరకరమైన వాటిపై చట్టప్రకారం చర్యలు

- 20 కేసులు నమోదు చేసిన సైబర్ కాప్స్
- 8 మందిని గుర్తించి నోటీసులు జారీ
- ఎమ్మెల్సీ కవితపైనా ట్రోలింగ్స్: డీసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాతో పాటు యూ ట్యూబ్ చానళ్లల్లో విచ్చలవిడిగా, విచక్షణ మరిచి ట్రోలింగ్స్ చేసే వారిపై నగర సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు వీటిపై కేసులు నమోదు చేసి, కంటెంట్ డిలీట్ చేయించడానికే పరిమితమయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఎదుర్కొంటున్న ఎమ్మె ల్సీ కవిత వ్యవహారంలో కొన్ని ట్రోలింగ్ చానల్స్ బరితెగించాయి. అభ్యంతరకరంగా, అసభ్యంగా, పరువు నష్టం కలిగించేలా, మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా ఉన్న పోస్టులకు సంబంధించి 20 కేసులు నమోదు చేసి ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్ బుధవారం వివరాలు వెల్లడించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుతో..

◆ దర్యాప్తు దశలోనే ఉన్న ఓ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితతో పాటు మరి కొందరు ప్రముఖులపై ట్రోల్ కుర్రాడు, మిస్టర్ మస్సబ్బాయ్, యంకమ్మ ట్రోల్స్, తెలుగు ట్రోల్స్ న్యూ, చిమ్టు ట్రోల్స్, టీమ్ ఆఫ్ ట్రోలింగ్, బంతిపువ్వు ట్రోల్స్, చందు ట్రోల్స్, చెవిలోపువ్వు చానళ్లల్లో ట్రోలింగ్స్‌తో పాటు ఫొటోమార్ఫింగ్ సైతం చేశారు. ఓ మహిళా ప్రజా ప్రతినిధిపైనే దీనిపై దృష్టిపెట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇన్‌స్పెక్టర్లు పి.పద్మ, డి.దర్శుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

◆ అసెంట్‌గా పిలిచే ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఆధారంగా దర్యాప్తు చేసిన స్పెషల్ టీమ్స్ ఈ 9 చానళ్లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 8 మంది బాధ్యుల్ని గుర్తించారు. ఎ.శ్రీనివాసరావు (విజయనగరం), ఎస్.మణికంఠ (కడప), బి.శ్రవణ్ (నిజామాబాద్), ఎం.శ్రీను (వరంగల్), పీఎస్ జ్యోతి కిరణ్ (కృష్ణా), వి.నవీన్ (జగిత్యాల), బి.చంద్రశేఖర్ (కరీంనగర్), బి.శ్రీకాంత్ (కడప)కు నోటీసులు జారీ చేశారు. వీరంతా 20–30 ఏళ్ల మధ్య వయస్కులని, ఎలాంటి రాజకీయ కోణం లేకపోయినా లైక్స్, టీఆర్పీ, రెవెన్యూ కోసమే ఇలా చేస్తున్నారని గుర్తించారు. వీరితోనే ఆయా చానల్స్‌లోని కంటెంట్‌ను డిలీట్ చేయిస్తున్న పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

ఇలాంటి ట్రోలర్స్‌తో పాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టే వారికి ఇదో హెచ్చరికని, ఏ మహిళను ట్రోల్ చేసినా వదిలిపెట్టమని స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. యూట్యూబ్ ధోరణిపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సీ) లేఖ రాయాలని నిర్ణయించామన్నారు. యూట్యూబ్ సహా మరికొన్ని సామాజిక మాధ్యమాల్లో ఉన్న అనేక అంశాలపై దృష్టి పెడుతున్నామని ఏసీఈప కేవీఎం ప్రసాద్ చెప్పారు. దీనికోసం సైబర్ క్రైమ్ ఠాణాలో సోషల్ మీడియా టీమ్ పని చేస్తోందన్న ఆయన నిర్దిష్ట ఫిర్యాదులు లేకపోవడంతో కేసులు నమోదు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. కరాటే కళ్యాణి మాదిరిగా ప్రతి సామాజిక కార్యకర్త ముందుకు వచ్చి ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి, బాధ్యతలపై చర్యలు తీసుకుంటామన్నారు.

వివేకా కేసు విచారణకు నూతన సిట్

- సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో ఐదుగురితో బృందం
- ఏప్రిల్ 30 లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం
- రాంసింగ్‌ను తప్పించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సీబీఐ ఏర్పాటు చేసింది. బృందంలోని సభ్యుల పేర్లను సీబీఐ అందజేయగా సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. దర్యాప్తును వేగవంతం చేసి ఏప్రిల్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న రాంసింగ్‌ను తప్పించింది. వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. నూతన సిట్ బృందానికి సీబీఐ డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వం వహించనున్నారు. ఈ బృందంలో ఎస్పీ వికాస్‌సింగ్, అదనపు ఎస్పీ ముకేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీమతి, నవీన్ పూనియా, ఎస్ఐ అంకిత్ యాదవ్ ఉన్నారు.

ఇలా ఎంతకాలం?

దర్యాప్తు అధికారి మార్పు/కొనసాగింపుపై సీబీఐ డైరెక్టర్ నిర్ణయాన్ని వెల్లడించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సీబీఐ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ తాజాగా జాబితాను అందజేశారు. చౌరాసియా నేతృత్వంలోని నూతన సిట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ సందర్భంగా దర్యాప్తు ఆలస్యం అవుతోందని అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం వేగంగా పూర్తి చేయాలని పేర్కొంది. భారీ కుట్ర కారణంగా ట్రయల్ కోర్టులో అదనపు చార్జిషీటు దాఖలు చేసేందుకు స్వేచ్ఛ కావాలని సీబీఐ కోరడంతో ఇలా ఎంతకాలం సాగదీస్తారని జస్టిస్ సీటీ రవికుమార్ ప్రశ్నించారు. 'విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించాయి. మేం మరోసారి అదే చెబుతున్నాం. బెయిల్ పిటిషన్ దరఖాస్తు చేసుకునేందుకు ఏ5 (శివశంకర్‌రెడ్డి) భార్య అనుమతి కోరారు. ఈరోజు నుంచి ఆర్నెల్ల వరకూ విచారణ ప్రారంభం కాకుంటే రెగ్యులర్ బెయిల్‌కు ఏ5 దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలు వర్తించవు. కేవలం మెరిట్స్ ప్రకారమే హైదరాబాద్‌లోని ట్రయల్ కోర్టు విచారిస్తుంది. ఈ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నాం' అని ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది.

విజయవాడ-కువైట్ విమాన సర్వీస్ ప్రారంభం

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి కువైట్‌కు ఎయిరిండియా విమాన సర్వీస్‌లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుచినాపల్లి నుంచి ఇక్కడికి వచ్చిన బోయింగ్ 737–800 విమానం ఉదయం 9.55 గంటలకు బయలుదేరి కువైట్ వెళ్లింది. ఈ విమానం కువైట్ నుంచి రాత్రి 8.35 గంటలకు ఇక్కడికి చేరుకుంది. ఈ విమానం ప్రతి బుధవారం తిరుచినాపల్లి నుంచి వయా గన్నవరం మీదుగా కువైట్‌కు వెళ్లి వస్తుందని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

ఈడీ కార్యాలయానికి మళ్లీ సోమ భరత్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ వరసగా రెండోరోజూ బుధవారం ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్సీ కవిత నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ల నుంచి సమాచారం సేకరించే యత్నంలో ఈడీకి సహ కరించడానికి ఆయన వచ్చినట్లు సమాచారం. మరోవైపు, ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు బుధవారం మరోసారి విచారించారు. మద్యం వ్యాపారంలో సలహాలు ఇవ్వడానికే తాను సమావేశాలకు హాజరయ్యానని అధికారులకు బుచ్చిబాబు చెప్పినట్లు తెలిసింది.

రీచార్జ్ చేయలేదని బాలుడి బలవన్మరణం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన

కాటారం: టీవీ, మొబైల్ రీచార్జ్ చేయలేదని ఓ బాలుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మద్దులపల్లిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మద్దులపల్లికి చెందిన గోగు యశోదకు కూతురు శరణ్య, కొడుకు గోగు తరుణ్ అలియాస్ చింటు(12) ఉన్నారు. యశోద భర్త అర్జయ్య మూడేళ్ల క్రితం చనిపోగా కూలిపని చేస్తూ పిల్లలను పోషిస్తోంది. తరుణ్ కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. రెండ్రోజుల క్రితం ఇంట్లో టీవీ, మొబైల్‌లో బ్యాలెన్స్ గడువు ముగిసింది. బుధవారం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తరుణ్ రీచార్జ్ చేయాలని తల్లిని అడిగాడు. టీవీ కేబుల్ బాగోలేదని సాయంత్రం రిపేర్ చేయించి రీచార్జ్ చేయిస్తానని, ఫోన్ కూడా రీచార్జ్ చేస్తానని యశోద కొడుకుకు చెప్పి కాడెద్దులకు నీరుపెట్టడానికి చేను వద్దకు వెళ్లింది. అడిగిన వెంటనే రీచార్జ్ చేయలేదని మనస్తాపానికి గురైన తరుణ్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఇనుప పైప్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన చుట్టు పక్కల వారు తల్లికి సమాచారం అందించి అస్వస్థతకు గురైన తరుణ్‌ను మహదేవపూర్ ప్రజా వైద్యశాలకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తరుణ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగస్టులో సాగుతో మిరపలో తెగుళ్ల నివారణ

రఘునాథపాలెం: రైతులు వేసవిలోనే దుక్కులు దున్నుకోవడంతో ఆగస్టులో మిరప సాగు చేస్తే నల్లితామర ప్రభావం లేకుండా అధిక దిగుబడి సాధ్యమవుతుందని వైరా కృషి విజ్ఞన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం 'మిరపలో మేలైన యాజమాన్య పద్ధతులు' అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మిరపలో నల్ల తామర ప్రధాన సమస్యగా ఉన్నందున రైతులు ప్రస్తుతం పంట వేసే సమయం కన్నా ముందుగా ఆగస్టులోనే పంట వేసుకోవడం, సిఫారసు మేరకే ఎరువులు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అలాగే, చేను చుట్టూ రక్షణ పంటల సాగు, సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వైరా కేవీకే శాస్త్రవేత్త రవి, జెడ్పీటీసీ ప్రియాంక, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కర్‌రావుతో పాటు కొంటెముక్కల వెంకటేశ్వర్లు, రవి, భూక్యా లక్ష్మణ్‌నాయక్, కుర్ర భాస్కర్‌రావు, నల్లమోతు శ్రీను, కొలంగొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పమ్మి


పమ్మి వెంకటేశ్వర్లు

ఖమ్మంగాంధీచౌక్: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్(ఎన్ఏపీఈ) గ్రూప్–సీ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పమ్మి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సంఘం మహాసభ హైదరాబాద్‌లో జరగగా రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖమ్మం డివిజన్‌కు చెందిన వెంకటేశ్వర్లుకు అవకాశం దక్కింది. ఈ మహాసభల్లో ఖమ్మం డివిజన్ నుంచి బి.వీరన్న, బి.హుస్సేన్, బాబూలాల్ ప్రతినిధులు హాజరయ్యారు. కాగా, తన నియామకానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ నేత పువ్వాడకు స్వల్ప అస్వస్థత

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు బుధవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు ప్రత్యేక అంబులెన్స్‌లో ఆయనను హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాగేశ్వరరావును చేర్పించినట్లు తెలిసింది.

జిల్లా వార్తలు

తిరుమల నుంచి పట్టువస్త్రాలు..


మగ్గంపై స్వామివారి వస్త్రాలను నేస్తున్న చేనేత కార్మికులు (ఫైల్)


స్వామివారి పట్టువస్త్రాలు


సీతమ్మవారి చీరలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఏటా సీతారాముల కల్యాణానికి నిజాం నవాబులు స్వయంగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వారు అందజేస్తున్నారు. దీంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరి పీఠం, శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం నుంచి కూడా పట్టువస్త్రాలు సమర్పిస్తుంటారు. ఇంకా పెళ్లిలో వధూవరులు ఉపయోగించే చీరలు, ధోవతులను భద్రాచల దేవస్థానం ప్రత్యేకంగా నేయిస్తుంది. దీనికోసం హైదరాబాద్ నుంచి మార్చి మొదటి వారంలో నలుగురు చేనేత కార్మికులు భద్రాచలం చేరుకున్నారు. రంగనాయకుల గుట్టపై ఉన్న ధ్యాన మందిరంలో ప్రత్యేకంగా మగ్గాలు ఏర్పాటు చేశారు. సుమారు 25 రోజుల పాటు శ్రమించి సీతమ్మకు రెండు చీరలు, శ్రీరాముడికి పది పంచెలు సిద్ధం చేశారు.

ఒక్కో చీరకు ఐదు రోజులు..

సీతమ్మకు పట్టువస్త్రాలు నేసేందుకు పోచంపల్లి పట్టు తయారీలో ప్రసిద్ధులైన నేత కార్మికులు భద్రాచలం చేరుకున్నారు. చీరల తయారీకి బెంగళూరు పట్టు, జరీని ఉపయోగించారు. ఒక్కో చీరకు సుమారు కేజీ పట్టును వినియోగించారు. ఈసారి సీతమ్మ తల్లి ధరించే చీరలను నవరంగ్ డిజైన్‌లో రూపొందించారు. కనులకు ఇంపుగా కనిపించేందుకు ఎరుపు, పచ్చ, గుమ్మడిపువ్వు రంగు, వాయిల్ రంగులను ఉపయోగించారు. కొంగులో రాజస్థాన్ డిజైన్ వేసినట్టు చేనేత కార్మికులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో పని చేశామని, ఒక్కో చీర తయారీకి ఐదు రోజులు పట్టిందని చెప్పారు. పెళ్లి కొడుకు రామయ్య కోసం కోటకొమ్ము డిజైన్‌లో పది పంచెలను సిద్ధం చేశారు.


నిబంధనలు భక్తులకే.. బంధుమిత్రులకు కాదు

ఏటా విమర్శలకు తావిస్తున్న సిబ్బంది వ్యవహారశైలి

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణ వేడుకల్లో వేలాది మంది పోలీసులు, వందల సంఖ్యలో ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. వీరిలో కొందరి తీరుతో ఏటా భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కనులారా రామయ్యను చూసేందుకు మిథిలా స్టేడియం ప్రాంగణానికి చేరుకోగానే నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతుంటారు. ఎంట్రీ పాస్‌లు ఉంటేనే అనుమతిస్తారు. కానీ బారికేడ్ల దగ్గర ఉండే సిబ్బంది, కొందరు పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది మాత్రం తమ కుటుంబ సభ్యులు, పరిచయస్తులను ఎంట్రీ పాస్ లేకుండానే కల్యాణ వేడుకలకు అనుమతిస్తారు. మరోవైపు కరోనా కారణంగా మూడేళ్లుగా భక్తులు వేడుకలకు హాజరుకాలేకపోయారు. ఈసారి పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇక వేడుక ముగిశాక కల్యాణ మండపం కింద పడ్డ తలంబ్రాలు తీసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతూ పోటీ పడుతుంటారు. వీరిని నియంత్రించాల్సిన సిబ్బంది విధులు మరిచిపోయి తలంబ్రాలు ఏరుకుంటూ ఉంటారు. దీంతో వేడుక చివరలో గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. ఈసారైనా సిబ్బంది భక్తులను ఇబ్బంది పెట్టకుండా, పాస్‌లు లేని వారి బంధుమిత్రులను అనుమతించకుండా, విధులు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'మూడు సూత్రాల' ముచ్చట

సీతమ్మ వారి మంగళసూత్రాలు ప్రత్యేకం


సీతమ్మ వారి మూడు మంగళసూత్రాలు

భద్రాచలం: భద్రాచల దివ్యక్షేత్రంలో సీతమ్మ వారి మంగళసూత్రాలకు ఎంతో విశిష్టత, ప్రత్యేకత ఉన్నాయి. నూతన వధువుకు మాంగళ్యధారణ సమయంలో రెండు మంగళసూత్రాలు మాత్రమే ఉంటాయి. ఒకటి పుట్టింటి వారు, రెండోది మెట్టినింటి వారు చేయిస్తారు. అయితే భద్రాచలంలో సీతమ్మ వారికి రామచంద్ర స్వామి మూడు సూత్రాలతో మాంగళ్యధారణ చేస్తారు. సీతమ్మ వారికి పుట్టింటి, మెట్టింటి వారితో పాటు భక్త రామదాసు కూడా సీతమ్మ తల్లిని కుమార్తెగా, రామయ్య తండ్రిని కుమారుడిగా భావించి మరో సూత్రాన్ని చేయించాడు. ఈ మంగళసూత్రాన్ని పార్వతీదేవి, లక్ష్మీదేవి, సరస్వతి దేవి ముందుంచి ప్రత్యేక పూజలు చేస్తారు. ఒక్క సీతమ్మ వారికే ఇలా మూడు సూత్రాలతో మంగళధారణ జరిగే శుభ సన్నివేశాన్ని చూసిన భక్తులు పునీతులవుతారు.

రూ.కోటి ప్రకటించడం వివక్షే..

భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి వారి కల్యాణానికి రూ.కోటి నిధులు ప్రకటించడం చూస్తే భద్రాద్రిపై సీఎం కేసీఆర్ చూపుతున్న వివక్ష అర్థమవుతోందని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య విమర్శించారు. దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణానికి సుమారు రూ. 3కోట్లు ఖర్చు చేస్తుంటే.. ప్రభుత్వం నుంచి రూ. కోటి ప్రకటించడమేమిటని ప్రశ్నించారు. కాగా ఇదేదో భారీగా నిధులు కేటాయించినట్లు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొనడంపై అసహనం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే రూ.వెయ్యి కోట్లు ప్రకటించాలని కోరారు. మొదటి నుంచి భద్రాద్రి అభివృద్ధిపై సీఎం సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, తెలంగాణ ఏర్పడ్డాక మొదటిసారి వచ్చిన ప్పుడు ప్రకటించిన రూ.100 కోట్లు ఇప్పటికీ విడుదల చేయలేదని ఎమ్మెల్యే ఓ ప్రకటనలో ఆరోపించారు.


గోదావరిలో స్నానమాచరిస్తున్న భక్తులు

కల్యాణం చూసొద్దాం..

భద్రాచలంలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణం జరగనుండగా భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్


హృదయంలో రాముడితో ఆంజనేయస్వామి సైకత శిల్పం


కల్యాణ వేడుకకు తరలివస్తున్న జనులు


స్వామివారి ఆలయం వద్ద పోలీసుల బందోబస్తు


ప్రసాదాల కౌంటర్లు


గోదావరి తీరాన డేరాలో సేద..


బుధవారం రాత్రి కల్యాణవేదిక వద్ద నిద్రిస్తున్న భక్తులు